## గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం



3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## ఎస్ఐఆర్ నోటీసులతో ప్రజల ఆందోళన సహాయం కోసం ఎదురుచూపులు


3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 242 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 27 ఆగస్టు 2026

### పెట్టుబడులను ఆకర్షించేలా

# ఇన్వెస్ట్ తెలంగాణ

నిపుణులతో కమిటీల ఏర్పాటు
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


2లో

# కెఎన్ఎస్ యూతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంఓయూ

**- మంత్రి వాకిటి శ్రీహరికి సీఎం అభినందనలు**



**హైదరాబాద్,ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, ప్రపంచంలోనే అత్యున్నత పని తీరు కలిగిన క్రీడలకు ప్రముఖ సంస్థల్లో ఒకటైన కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీ (కెఎన్ఎస్ యూ) తో ఎంఓయూ కుదుర్చుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గతంలో తన దక్షిణ కొరియా పర్యటనలో కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ అధ్యక్షులు మూన్ వోన్-జే తో సహా ఉన్నత ప్రతినిధి బృందాన్ని కలిశానని గుర్తు చేశారు. ప్రతిపాదిత యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, కెఎన్ ఎస్ యూమధ్య భాగస్వామ్యం కోసం తాము వివరంగా చర్చించినట్టు తెలిపారు. ఈ భాగస్వామ్యం ఇప్పుడు కేవలం ఒక ఎంఓయూ కంటే ఎక్కువ. ఇది తెలంగాణ క్రీడా ప్రతిభకు, అథ్లెట్ శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, మిగతా2లో...


2లో

# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

- వరదల్లో వందలాది మంది గల్లంతు
- అందులో 105 మంది భారతీయులున్నట్లు అంచనా
- టిబెట్‌లో భారీ వర్షాలతో ఉప్పొంగిన కోశీనది
- బురదమయంగా మారిన కొండతీర ప్రాంతం

# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

- భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ
- మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు
- సుష్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి



**హైదరాబాద్,ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్‌లో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. క్రమశిక్షణ కమిటీ నివేదిక అందిన తరవాత కొండామురళి రంగంలోకి దిగారు. నేరుగా ఆయన డిప్యూటి సిఎం భట్టిని కలిశారు. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ చేయలేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. అయితే, సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని కొండా సురేఖ స్పష్టం చేశారు. తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త , ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల మిగతా2లో...

# ఇందిరమ్మ ఇండ్లు.. ఫైనల్ బిల్లులను మేమే చెల్లిస్తాం: పొంగులేటి



**హైదరాబాద్,ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా రాష్ట్ర ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్రం నుంచి మిగతా2లో...

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఆగివున్న లారీని
ఢీకొన్న ట్రావెల్ బస్సు
ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికుల దుర్మరణంమృతులంతా ఎపికి చెందిన వారిగా గుర్తింపు - ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి
వ్యక్తం చేసిన సిఎం రేవంత్
తక్షణ సహాయక చర్యలకు ఆదేశం...


2లో


2లో

# వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

- సోషల్ ఇంజనీరింగ్ నాటకాలకు తెర
- అప్రమత్తంగా ఉండాలన్న సిపి సజ్జన్నార్

# నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

- కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలి
- గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలి
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్, ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు జరిగాయి. కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని, గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. ఉత్సవాల్లో భాగంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగింది. అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభలో మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌లు మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. మతాల మధ్య ఐక్యతే తెలంగాణ బలం: సభలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. మనిషిని మనిషిగా గౌరవించడం, ప్రేమించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని అన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో మనుషుల మధ్య విభేదాలు మిగతా2లో...




# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

చెట్టును ఢీకొన్న కారు....ముగ్గురు దుర్మరణం
నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం

**నిజామాబాద్, ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు మిగతా2లో...

# 22ఎను వెంటనే తొలగించాలి

లేకుంటే సచివాలయం ముట్టడిస్తాం
భూకబ్జాల హైదరాబాద్ బ్రాండ్‌కు దెబ్బ
రేవంత్ ప్రభుత్వం భూ అమ్మకాలతో బిజీ
బిఆర్ఎస్ నేత హరీస్ రావు విమర్శలు


2లో

# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

**ఖాట్మండు ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** నేపాల్‌లో మెరుపు వరదలు భీభత్సం సృష్టించడంతో భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరిగింది. ఈ ఘటనలో కనీసం 95 మంది మృతి చెందినట్టు నిర్ధారణ కాగా, 400 మందికి పైగా గల్లంతయ్యారు. వీరిలో కనీసం 133 మంది భారతీయులున్నారు. అనేక భవనాలు, వాహనాలు, ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. బురదలో ఇంకా అనేక మంది కూరుకుపోయినట్టు అంచనా వేస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే, భూకంపం, ఆపై కొండచరియలు విరిగిపడటంతోనే భోటెకోశీ నది ప్రళయానికి కారణమని నేపాల్ విదేశాంగ శాఖ శిశిర్ ఖనాల్ వెల్లడించింది. ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో భూకంపం వచ్చిందని, దాంతో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయని చెప్పారు. నదీ ప్రవాహానికి కొండచరియలు అడ్డుపడటం ఆకస్మిక వరదలకు కారణమైనట్టు తెలుస్తోందని చెప్పారు. అధికారుల సమాచారం ప్రకారం, బుధవారం ఉదయం 9 గంటల సమయంలో టిబెట్ వైపు నుంచి వచ్చిన ఉద్ధృతి భోటేకోశి నదిలోకి చేరింది. దీంతో టిమురే, స్యాప్రు బేస్ ప్రాంతాలు తీవ్రంగా ప్రబావితమయ్యాయి. గ్యిరాంగ్ సరిహద్దు క్రాసింగ్ సమీపంలోని టిబెట్ ప్రాంతంలో కూడా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా, మరికొందరు గల్లయంతయ్యారని చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్హువా వార్త సంస్థ తెలిపింది. నేపాల్-టిబెట్ సరిహద్దుకు చైనా వైపు ఏర్పాటు చేసిన భద్రతా కమెరాల్లో భారీగా రాళ్లు, నీటితో కూడిన వరద ప్రవాహం ఈ ప్రాంతాన్ని ముంచెత్తడానికి కొన్ని క్షణాల ముందు ప్రజలు పరుగులు తీస్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం ఆ వరద భవానాలు, వాహానాలను ధ్వంసం చేసిన పలువురు ప్రాణాలను బలిగొంది.కొండ చరియలు విరిగిపడడానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియనప్పటికీ.. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్స్ (జీఎఫ్‌జడ్) ఆసక్తికరమైన విషయం వెల్లడించింది. భద్రతా కెమెరాలో దృశ్యాలు కనిపించిన సమయానికి సుమారు ఏడు నిమిషాలకు ముందు 4.4 తీవ్రతో భూమి కంపించినట్టు జీఎఫ్‌జడ్ తెలిపింది. భూకంపం అనంతరం కొండచరియలు విరిగిపడటం, టిబెట్ నుంచి వచ్చిన ఉద్ధృతి భోటెకోశి నదిలోకి చేరడంతో నేపాల్‌లో భారీ విలయం సంభవించిందని చెబుతున్నారు. మెరుపు వరదలకు సంబంధించి ముందస్తు వార్నింగ్ ఇవ్వడంలో చైనా విఫలమైందనే ఆరోపణలు నేపాల్‌లో వినిపిస్తున్నాయి.

# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇప్పుడే వీరంతా ఎందుకు భేటీ అయ్యారన్నది చర్చ జరుగుతోంది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ వ్యాఖ్యలు చేసింది. ఎ-లాన్-బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను' అని కొండా మురళి వ్యాఖ్యానించారు. సుస్మితకు స్వతంత్రంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని తెలిపారు. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. సుస్మిత తనకు నచ్చినట్లు తాను ఉంటుందని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కొండా మురళి పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని అన్నారు. 'మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?' అని వ్యాఖ్యానించారు. కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి స్పష్టం చేశారు. ఉత్తమ్ కూడా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా వెళ్లిపోయారు. తాను సిఎంకు, పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె విమర్శించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ.. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

# నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించుకోవద్దని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసి జీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.తెలంగాణలో ప్రతి పౌరుడు ప్రశాంతంగా, గౌరవంగా జీవించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో వేలాది గా ,ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్. నుడచైర్మన్ కేశ వెను, శేఖర్ గౌడ్, నరాల రత్నాకర్ ,
జావిద్ అక్రమ్, కూద్దూస్, హారున్, కార్పొరేటర్లు సజ్జాద్ రహీల్, నయీమ్ షారాన్, అబ్దుల్ కరీం, అబిద్ బిన్ హందన్, అన్వార్, మొహమ్మద్ అహ్మద్, కో ఆప్షన్ మెంబెర్ మహేందర్ సింగ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మొయిన్, మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# 22ఎను వెంటనే తొలగించాలి

**హైదరాబాద్,ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22-ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమిషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22-ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22-ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది.

కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూ ర్ణగా మార్చారని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరా బాద్‌లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసిపోయిందని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు.

# వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

**హైదరాబాద్,ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనర్ హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు ఫోన్లను దొంగిలిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, అమాయకులను మొదట గుర్తిస్తారని.. స్క్రీన్ లాక్ ఎలా ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి నిశితంగా గమనించి అనంతరం చోరీ చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఒకవేళ ఫోన్ లాక్ అయి.. పాస్‌వర్డ్ తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా 'సోషల్ ఇంజినీరింగ్' నాటకాలకు తెరలేపుతారని సీపీ చెప్పారు. బాధితుడు తన పోయిన ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి.. తాము బస్సు కండక్టర్/ డ్రైవర్ అని, ఫోన్ బస్సులో దొరికిందని చెబుతారు. వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని.. వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని క్లెయిమ్ చేస్తున్నారని చెబుతారు. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మించి అన్‌లాక్ వివరాలు రాబడతారు. ఒకవేళ ఫోన్ పోయినట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారిక పోర్టల్‌లో మొబైల్ ఎఓఇఎ నంబర్ నమోదు చేసి ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయించాలి. ఒకవేళ ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లు, వృద్ధులకు ఈ తరహా సరికొత్త నేరాల పట్ల అవగాహన కల్పించి, వారు ప్రయాణాల్లో ఫోన్లు వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి' అని సీపీ సూచించారు.

# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మూడు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**సూర్యాపేట,ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వార కుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాల య్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

# పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ

**హైదరాబాద్,ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌ను పెట్టుబడులను ఆకర్షించేలా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. హైదరాబా ద్‌లోని మహాత్మా జోతిబా పూలే ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల, ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని భట్టి సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవాలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగా హన ఒప్పం దాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగిం చాలన్నారు. డిసెంబర్‌లో జరిగే సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్‌షో లు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహిం చాలనీ, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను సయమపాలన ప్రకారం పూర్తి చేయాలని భట్టి స్పష్టం చేశారు.

# కెఎన్ఎస్ యూతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంఓయూ

(మొదటి పేజీ తరువాయి)

హై-పెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్ లో ప్రపంచ ఉత్తమ విధానాలకు మధ్య ఒక వారధి అని ఆయన పేర్కొన్నారు.కెఎన్ఎస్ యూలో శిక్షణ పొందిన అథ్లెట్లు పారిస్ ఒలింపిక్స్ లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాలలో 16 పతకాలను అందించారు. అలాంటి శ్రేష్టమైన సంస్కృతిని తెలంగాణకు తీసుకురావాలని తాము కోరుకున్నట్టు ఆయన తెలిపారు. అలాంటి కార్యక్రమాన్ని ముందుకు నడిపించి, మన యువ అథ్లెట్లు ప్రపంచ క్రీడా శ్రేష్టత నుంచి నేర్చుకునేందుకు కొత్త మార్గాలను తెరిచిన రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి, క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులకు, స్పోర్ట్స్ యూనివర్సిటీకి అభినందనలు తెలిపారు. దీంతో మన గ్రామాలు, పట్టణాల నుండి ఒలింపిక్ పోడియం వరకు తెలంగాణ ఈ ప్రయాణానికి సిద్ధమవుతోందని చెప్పారు. భారత్ 2036 ఒలింపిక్స్ వైపు చూస్తున్న తరుణంలో, తెలంగాణ సిద్ధంగా ఉండాలని నిశ్చయించుకుందని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లు.. ఫైనల్ బిల్లులను మేమే చెల్లిస్తాం: పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

రావాల్సిన నిధుల కోసం ఏడాదిగా ఎదురుచూశామని, పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేంద్రం నుంచి విడుదల కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రానికి కేంద్ర మంత్రి వచ్చిన సందర్భంలో, రెండు వారాల క్రితం పార్లమెంట్ సభ్యులతో కలిసి తాను స్వయంగా కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశానని మంత్రి పొంగులేటి తెలిపారు.

అయినప్పటికీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశ పెట్టుకుని పేద ప్రజలను ఇంకా ఎన్నాళ్లు ఇబ్బంది పెట్టాలని ఆయన ప్రశ్నించారు.

ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు చివరి బిల్లు కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 15,475 మంది లబ్ధిదారులకు రూ.185 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

మార్చి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు చివరి బిల్లుల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో గురువారం జమ అవుతాయని ఆయన తెలిపారు. మిగిలిన వారికి కూడా విడతల వారీగా నిధులు చెల్లిస్తామన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించారని, సెప్టెంబర్ 15వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

# ఎస్ఐఆర్ నోటీసులతో ప్రజల ఆందోళన సహాయం కోసం ఎదురుచూపులు

**కరీంనగర్ జిల్లా ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ఎస్ఐఆర్ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ప్రజల బాధలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. తమ ఓటు హక్కుకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదన్న ఆందోళనతో ప్రజలు ఆగమాగం అవుతున్నారు. నోటీసు ఎందుకు వచ్చింది? ఏ పత్రాలు సమర్పించాలి? ఎక్కడికి వెళ్లాలి? ఎవరిని సంప్రదించాలి? అనే ప్రశ్నలకు సరైన సమాధానాలు దొరకక అనేక మంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.ప్రజలకు మార్గనిర్దేశం చేయాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడం, కార్యాలయాల చుట్టూ తిరిగినా స్పష్టమైన సమాచారం లభించకపోవడం తమను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, కూలీలు, నిరక్షరాస్యులు నోటీసుల ప్రక్రియను అర్థం చేసుకోలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న వారికి తమ వాదనను వినిపించే



అవకాశం, అవసరమైన పత్రాలు సమర్పించే విధానం వంటి విషయాల్లో అధికారులు స్పష్టమైన సహకారం అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల సంఘం కూడా నోటీసులు, పరిశీలన ప్రక్రియలో అర్హులైన ఓటర్లు తమ హక్కును కాపాడుకునేందుకు నిర్దేశిత విధానంలో స్పందించే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది."మా ఓటు హక్కు కోసం ఎక్కడికి వెళ్లాలో కూడా తెలియడం లేదు.. మాకు దారి



చూపించండి" అంటూ పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల సమస్యలను కేవలం కాగితాలపై కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని, ప్రతి నోటీసు అందుకున్న వ్యక్తికి ప్రత్యేకంగా సహాయం అందించేలా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, అవసరమైన పత్రాలు మరియు తదుపరి చర్యలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.ఒక ఓటు కేవలం గుర్తింపు కాదు.. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి హక్కుకు ప్రతీక. ఆ హక్కును కాపాడేందుకు అధికార యంత్రాంగం ప్రజల పక్కన నిలవాల్సిన అవసరం ఉంది.

---

# గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం

**4 కోట్ల 46 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు**

**వ్యవసాయ మార్కెట్ యార్డుల అభివృద్ధికి**

**3 కోట్ల 11 లక్షల రూపాయలు**

**శివాపూర్, గోగుపల్లిలో కోటి 35 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభం: మంత్రి సీతక్క**

**ములుగు జిల్లా ఆగస్టు26(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.బుధవారం తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో 4 కోట్ల 46 లక్షల రూపాయలతో చేపట్టిన




వివిధ అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.తాడ్వాయి వ్యవసాయ మార్కెట్ యార్డులో 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.అనంతరం సీఆర్ఆర్‌ప్లెయిన్ 202526 నిధులతో ఏటూరునాగారం మండలం శివాపూర్ గ్రామంలో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను ప్రారంభించారు. శివాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోగుపల్లిలో 55 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.అనంతరం ఏటూరునాగారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ నిధులు 2 కోట్ల 28 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణంతోపాటు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో వసతుల కల్పనకు అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు

**ఓటరు జాబితాలో పేర్లు, వివరాలను సరిచూసుకోవాలి**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు జిల్లా ఆగస్టు26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు, వార్డుసభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సభల్లో సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటరు జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకునేందుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు.అర్హులైన పౌరులు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు నమూనా6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం నమూనా7, వివరాల సవరణ కోసం నమూనా8ను వినియోగించుకోవాలని సూచించారు.ఆచూకీ లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన, రెండు చోట్ల నమోదైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ, వార్డు సభల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అందులో ఏవైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే తగిన ఆధారాలతో సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ జాబితాలతోపాటు అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచి ప్రత్యేక సమగ్ర సవరణ



ప్రక్రియలో పారదర్శకత పాటించనున్నట్లు వెల్లడించారు.అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభమైందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారి ద్వారా ఓటరుకు లేదా వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేస్తారని పేర్కొన్నారు. నోటీసులో తెలిపిన తేదీ, సమయం, ప్రదేశంలో ఓటరు స్వయంగా విచారణకు హాజరై అవసరమైన అసలు ధ్రువపత్రాలను చూపించాలని సూచించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు సమీప గ్రామ పంచాయతీ భవనం లేదా వార్డు కార్యాలయంలో విచారణలు నిర్వహించనున్నట్లు తెలిపారు.నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల నమోదు అధికారి లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి ఎదుట హాజరై ధ్రువపత్రాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఓటర్ల సేవల అంతర్జాల వేదిక ద్వారా కూడా సంబంధిత పత్రాలను ముందుగానే జతచేయవచ్చని తెలిపారు.2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. 1987 జూలై 1కి ముందు జన్మించిన వారు ఎన్నికల సంఘం గుర్తించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని పేర్కొన్నారు. 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లి లేదా తండ్రికి సంబంధించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి అందజేయాలని తెలిపారు. 2004 డిసెంబర్ 2 తరువాత జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లిదండ్రులిద్దరి ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు.శాశ్వత నివాస, అటవీ హక్కులు, కుల, జనన ధ్రువపత్రాలు, కుటుంబ నమోదుపత్రం, ప్రభుత్వ భూమి లేదా గృహ కేటాయింపు పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, పదో తరగతి లేదా ఇతర విద్యార్హత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డు, పింఛను చెల్లింపు ఆదేశ పత్రం, జాతీయ పౌరుల నమోదుపత్రంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, జీవిత బీమా సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారని పేర్కొన్నారు.2002 ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాతో వివరాలు సక్రమంగా అనుసంధానమైన ఓటర్లు అదనపు ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆగస్టు 10లోగా గణన పత్రాన్ని సమర్పించని వారు దావాలు, అభ్యంతరాల స్వీకరణ కాలంలో దరఖాస్తు నమూనా6తోపాటు నిర్ణీత ప్రకటన పత్రాన్ని అందజేయవచ్చని పేర్కొన్నారు.ప్రజలు ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని కలెక్టర్ కోరారు. పేరు నమోదు కాకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా సవరణకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియపై సందేహాలు లేదా సమస్యలు ఉంటే దూరవాణి సంప్రదింపుల నమోదు సేవ, జాతీయ ఓటరు సేవల ఫిర్యాదుల అంతర్జాల వేదిక ద్వారా లేదా 1950 ఉచిత సహాయ సంఖ్యను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.


---

# వెంటనే చెత్తను తొలగించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి...

**సమస్య పరిష్కరించకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద నిరసన: ఎర్రం శ్రీనివాస్**

**ఉప్పల్‌లో చెత్త డంపింగ్‌తో రోడ్లపై దుర్గంధం వెంటనే సమస్య పరిష్కరించాలి**






**ఉప్పల్ ఆగస్టు 26(పిసిడబ్ల్యూ న్యూస్):**మేడ్చల్‌మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో డీమార్ట్ సమీపంలోని చెత్త డంపింగ్ కేంద్రం వద్ద చెత్త పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.గత నాలుగైదు రోజులుగా ఇంటింటి నుంచి చెత్తను సేకరించే వాహనాలు చెత్తను డంపింగ్ కేంద్రానికి తరలించి, అక్కడి ప్రదేశంతో పాటు రోడ్లపైనా భారీగా చెత్తను పోస్తున్నారని తెలిపారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, బాటసారులు రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు.ఇటీవల కురిసిన వర్షాలతో చెత్త తడిసి రోడ్లపై పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని, దోమల బెడద కూడా పెరిగిందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్య పరిస్థితులపై అధికారులు, పాలకులు తక్షణమే స్పందించాలని ఎర్రం శ్రీనివాస్ డిమాండ్ చేశారు."విశ్వ నగరంలో రోడ్లపై చెత్త సమస్యను ఎవరు పరిష్కరిస్తారు?" అని ప్రశ్నిస్తూ, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వెంటనే చెత్తను తొలగించి, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ హెచ్చరించారు.

# మృతిచెందిన బీజేపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం





**వచ్చునూర్,ఆగస్టు26(పీసీడబ్ల్యూ న్యూస్):** మండలంలోని వచ్చునూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త మద్దూరి చిరంజీవి నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు బీజేపీ కార్యకర్తలు ఆర్థిక సహాయం అందించారు.బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్ మండల బీజేపీ గ్రూప్‌లో సహాయం కోసం ఇచ్చిన పిలుపునకు స్పందించిన పలువురు కార్యకర్తలు తమ వంతు సహాయాన్ని అందించారు. ఉప్పులేటి జీవన్ ద్వారా సేకరించిన రూ.16 వేల నగదును బుధవారం స్థానిక కార్యకర్తల సమక్షంలో మృతుడి తండ్రి మొండయ్యకు అందజేశారు.ఈ సందర్భంగా బూట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, తోటి కార్యకర్త చిరంజీవి మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి తమ వంతుగా అందించిన సహాయం కొంతైనా ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సహాయ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ బూత్ అధ్యక్షులు వీణవంక అంజయ్య, ఉప్పులేటి జీవన్, రాంహన్మాన్ నగర్ ఉపసర్పంచ్ అందె శేఖర్, బండి స్వామి, పింగళి అమర్ వర్ధన్ రెడ్డి, ఉప్పులేటి బాబు, ఉప్పులేటి చిరంజీవి, మద్దూరి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా తాపాల లక్ష్మీనరసింహస్వామి**

# తిరుకల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం







**తిమ్మాపూర్,ఆగస్టు26(పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ పరిధిలోని స్వయంభు శ్రీ తాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 22వ అధ్యయన బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఆలయ ప్రధాన అర్చకులు వేద పండితులు తిరునగిరి వెంకటాద్రి స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు సామూహిక అన్నప్రసాద వితరణ చేపట్టారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# సాంబార్ స్థానంలో చింతపండు చారు.. ఆకుకూర పప్పుకు పంగనామం






● 1. రోగి కోసం చేతి సంచిలో భోజనం తీసుకెళ్తున్న రోగి బంధువులు. ● 2. ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు. ● 3. బాలింతలకు భోజనం తీసుకెళ్తున్న రోగి తరపు వారు. ● 4. ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి. ● 5. మెనూ ప్రకారం అందకుండా ఉన్న భోజనం. ● అడగొద్దు మెనూ .. పెట్టింది తిను ● ప్రభుత్వం నిర్దేశించిన మెనూకు తూట్లు ● సాంబార్ స్థానంలో చింతపండు చారు.. ఆకుకూర పప్పుకు పంగనామం ● దయాలసిస్ రోగులు, బాలింతలకు భోజనం అందించడంలోనూ నిర్లక్ష్యం ● ప్రశ్నిస్తే దురుసు సమాధానాలు ● నాణ్యత ప్రమాణాలపై కరవైన పట్టింపు ● గుత్తేదారు తీరుపై ఆరోపణలు ● చర్యలు చేపట్టాలంటున్న రోగులు

**ఏటూరునాగారం :ఆగస్టు 26(పిసిడబ్ల్యు న్యూస్):** రోగులకు వైద్యం ఎంత ముఖ్యమో.. చికిత్స సమయంలో సమయానికి నాణ్యమైన పౌష్టికాహారం అందించడం కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా దయాలసిస్ రోగులు, బాలింతలకు ఆహారంలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావులేదు. రోగుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించాల్సిన ఆహారానికి ప్రభుత్వం సమయాలు, పరిమాణాలతో సహా స్పష్టమైన మెనూను నిర్దేశించింది. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య 150 గ్రాముల ఇడ్లీ3, సాంబార్/చట్నీ 100 మి.లీ., పొంగల్/కిచిడీ/ఉప్మా 300 గ్రాములు, మినపప్పుచట్నీ/బ్రెడ్ 100 గ్రాములు, పాలు 150 మి.లీ., గుడ్డు ఒకటి ఇవ్వాలి. మధ్యాహ్నం 12 నుంచి 1 గంటలోపు 450 గ్రాముల అన్నం/6 అంగుళాల పుల్కా, కూరగాయల కూర 50 గ్రాములు, ఆకుకూరల పప్పు 100 గ్రాములు, సాంబార్ 150 మి.లీ., గుడ్డు, పెరుగు/మజ్జిగ 100 మి.లీ., అరటిపండుతో పాటు సాయంత్రం చిక్కీ 50 గ్రాములు/ఉడికించిన పల్లి 20 గ్రాములు అందించాలి. రాత్రి 6 నుంచి 8 గంటల మధ్య 450 గ్రాముల అన్నం/పుల్కా, కూరగాయల కుర్మా 100 గ్రాములు, సాంబార్ 150 మి.లీ., ఆకుకూరల పప్పు 50 గ్రాములు, గుడ్డు, పెరుగు/మజ్జిగ 100 మి.లీ. ఇవ్వాల్సి ఉంది. అయితే ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నిబంధనలు అమలు కావడం లేదని పలువురు రోగులు, బంధువుల నుంచి ' జూవెష'కు సమాచారం అందింది. ఆ సమాచారాన్ని నిర్ధారించుకునేందుకు ఆసుపత్రిలో పరిశీలించగా.. మెనూ బోర్డుపై ఉన్న నిబంధనలకు, రోగుల ప్లేట్లలో వడ్డిస్తున్న భోజనానికి పొంతనే లేకపోవడం



స్పష్టమైంది. **సాంబార్ స్థానంలో చింతపండు చారు.. పప్పుకు పంగనామం** ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్నం, రాత్రి భోజనంలో సాంబార్, ఆకుకూరల పప్పు, కూరగాయల కూర/కుర్మా, గుడ్డు, పెరుగు లేదా మజ్జిగ ఉండాలి. కానీ ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో సాంబార్‌కు బదులుగా చింతపండు చారు వడ్డిస్తున్నారు. ఆకుకూరల పప్పు అందించడం లేదు. పెరుగు లేదా మజ్జిగ కూడా క్రమం తప్పకుండా ఇవ్వడం లేదు. మెనూలో పేర్కొన్న పౌష్టిక పదార్థాలను పక్కనపెట్టి అన్నం, చారు, ఒక కూరతోనే భోజనం ముగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. రోగులు త్వరగా కోలుకునేందుకు అవసరమైన పోషకాలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూకే కోతలు పడుతుండటంపై రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాల్సిన చోట నామమాత్రపు భోజనంతో సరిపెట్టడం.. రోగుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన విధానాన్ని నీరుగారుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. **భోజనం పంపిణీలోనూ నిర్లక్ష్యం** ఈ పరిస్థితికి తోడు దయాలసిస్ రోగులు, బాలింతలకు వారి బెడ్ వద్దకే భోజనం అందించాల్సి ఉండగా.. ఈ విధానం సక్రమంగా అమలు కావడం లేదని రోగుల బంధువులు చెబుతున్నారు. రోగి తరఫున ఎవరైనా వచ్చి ఆహారం తీసుకెళ్తే అందిస్తున్నారని.. ఎవరూ రాకపోతే వారికి భోజనం అందని పరిస్థితి ఉంటోందని ఆరోపిస్తున్నారు. స్వయంగా లేచి వెళ్లలేని రోగుల వద్దకు సిబ్బందే భోజనం తీసుకెళ్లాల్సి ఉన్నా.. బంధువు వస్తేనే ఆహారం చేరే పరిస్థితి నెలకొనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగికి అందాల్సిన భోజనం కోసం కూడా బంధువులే పరుగులు తీయాల్సి వస్తుండటంతో.. ఆసుపత్రి సేవల పర్యవేక్షణ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. **తింటే తినండి.. లేకపోతే మీ ఇష్టం** మెనూ ప్రకారం భోజనం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించిన రోగులు, వారి బంధువులకు నిర్వాహకుల నుంచి దురుసు సమాధానాలు ఎదురవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. “ఇక్కడ ఇలాగే ఉంటుంది.. తినండి.. లేకపోతే మీ ఇష్టం” అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని పలువురు వాపోతున్నారు. భోజన నాణ్యత, నిర్ణీత పరిమాణాలు, సమయపాలనపై ప్రశ్నించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కనపెట్టి, నాణ్యతలోనూ కోతలు పెడుతూ గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు.. రోగుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యానికే తూట్లు పొడుస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే తనిఖీ నిర్వహించి వాస్తవాలను నిగ్గుతేల్చడంతోపాటు, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

---

# ప్రజలు పార్టీని ఆదరిస్తున్న.. కొందరు అసమ్మతి వాదుల కుట్ర రాజకీయంతో పార్టీ ఓడింది

**ఎవరైనా పార్టీ కంటే గొప్ప కాదు.. అధిష్టానం నిర్ణయమే సుప్రీం.. నాయకులు వస్తారు.. పోతారు**

**పార్టీ లైన్ దాటే నాయకులపై క్రమశిక్షణ చర్యలు తప్పవు**

**కొత్త వారిని చేర్పించి ఎంఐఎంను కరీంనగర్లో బలోపేతం చేయాలి**

**గులాం అహ్మద్ హుస్సేన్ కు..ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ దిశానిర్దేశం**

**అసదుద్దీన్ ఒవైసీనీ ఆత్మీయంగా కరచాలనం చేసి, సన్మానించిన గులాం అహ్మద్ హుస్సేన్**



**కరీంనగర్, ఆగస్టు 26(పిసిడబ్ల్యు న్యూస్):** ప్రజల్లో ఎంఐఎం పార్టీ ఆదరణకు , చూపించే అభిమానానికి ఎప్పటికీ కొదవ లేదని, పార్టీ లైన్ దాటి కొందరు అసమ్మతి వాదులు, మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఇతర పార్టీల ఎమ్మెల్యేలతో జతకట్టి, టౌన్ బాడీ నాయకత్వాన్నీ బలహీన పర్చాలనే కుట్ర పన్ని, పార్టీ ఓడిపోతే నాయకత్వ మార్పు ఉటుందని, మేము సీనియర్లమని మాకే పార్టీ బాధ్యతలు ఇస్తారని పగటి కలలు కని, కుళ్లు రాజకీయాలతోనే పార్టీని మున్సిపల్ ఎన్నికల్లో ఘోరంగా ఓడించారని, వీరిపై ఖచ్చితంగా క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని, తెలంగాణ లోని పలు జిల్లాల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు, ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం పార్టీ జాతీయ కార్యాలయం, హైదరాబాద్ దారుస్సలాంలో నిర్వహించిన ఎంఐఎం పార్టీ జిల్లా, నగర, అధ్యక్షులతో, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, క్రియాశీలక కార్యకర్తల సమావేశం పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన జరిగింది. ముందుగా ఖురాన్ పఠనంతో మొదలైన ఈసమావేశం చాలా హాట్ హాట్ గా జరిగింది. ఈసందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పలు జిల్లాల్లో అసంతృప్తిని మిగిల్చాయన్నారు. ఫలితాలు వచ్చిన చోట అందర్నీ కలుపుకపోవాలన్నారు. కొన్ని జిల్లాలలో పార్టీ నగర అధ్యక్షులు ఫలితాల కోసం కష్టపడినా, కొందరు గ్రూపుగా ఏర్పడి, దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతూ, పార్టీ ఓటమికి కారణమయ్యారని, వాళ్లు కూడా ఓడిపోయి, ఎంఐఎం పార్టీ అభ్యర్థులను ఓడించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూపు రాజకీయలను తక్షణమే వీడి, ఆయా జిల్లాలలో పార్టీ నాయకత్వంతో కలిసి, బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. నేను పార్టీలో చాలా సీనియర్ ను, పెద్ద హోదాలో పని చేశాను, నావద్దకు వచ్చి నగర పార్టీ నాయకత్వం నా వద్దకు వస్తేనే సరే లేకుంటే నేను ఇలానే చేసుకుంటూ పోతాను అంటే అటువంటి అసమ్మతి నాయకులను, పార్టీకి నష్టం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, తక్షణమే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అసమ్మతి వాదులు తీరు మార్చుకొని, నగర నాయకత్వం తో కలిసి పని చేయాలని ఆదేశించారు. ఎవరైనా పార్టీ కంటే గొప్ప కాదని అధిష్టానం నిర్ణయమే సుప్రీమ్ అని, పార్టీలో నాయకులు వస్తారు, పోతారు, కానీ పార్టీ కంటే గొప్పవారు ఎవరు కాదన్నారు. పార్టీ లైన్ దాటే నాయకులపై ఖచ్చితంగా క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు.

కొత్తవారిని చేర్పించి ఎంఐఎం పార్టీని కరీంనగర్లో మరింతగా బలోపేతం చేయాలని కరీంనగర్ ఎంఐఎం అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ కు, అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. పార్టీకి ఆకర్షితులై కొత్తగా పార్టీలో చేరే వారి కోసం తలుపులు తెరిచే ఉంటాయన్నారు. పార్టీ బలోపేతం కోసం ఎవరినైనా తీసుకొని క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈసందర్భంగా ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లతో, కాంటెస్టేడ్ కార్పొరేటర్లతో కలిసి గులాం అహ్మద్ హుస్సేన్, అధినేత అసదుద్దీన్ ఒవైసీ తో మర్యాదపూర్వకంగా కరచాలనం చేసి ఆత్మీయంగా పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం, మాజీద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్, మాజీ కోఆప్షన్ మెంబెర్ అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, ఎంఎ సలీమ్, అబ్దుల్ గఫ్ఫార్, వాజిద్ అలీఖాన్, మేరాజ్, అబ్దుల్లా ఖాన్ తో పాటు సుమారు 200మంది పాల్గొన్నారు.

---

# ఘనంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు.





**- నగరవ్యాప్తంగా కేక్ కటింగ్‌లు, ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు**

**కరీంనగర్,ఆగస్టు26 (పీసీడబ్ల్యు న్యూస్):** కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు బుధవారం నగరవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో మేయర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మేయర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కొలగాని శ్రీనివాస్ భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.అనంతరం శివభక్త హనుమాన్ దేవాలయం, కోదండ రామాలయం, మహాశక్తి దేవాలయాల్లో మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, కరీంనగర్ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. మహాశక్తి దేవాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆశీస్సులు తీసుకోగా, ఆయన మేయర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. **ఉచిత వైద్య శిబిరం ప్రారంభం** మేయర్ జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్, వెంకటాద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు అందించారు. **వివేకానంద చౌరస్తాలో వేడుకలు** బీజేపీ పశ్చిమ జోన్ ఆధ్వర్యంలో వివేకానంద చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో మేయర్ పాల్గొని కేక్ కట్ చేశారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. **తెలంగాణ చౌక్‌లో 39 కిలోల భారీ కేక్** నగరపాలక సంస్థ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 39 కిలోల భారీ కేక్‌ను మేయర్ కొలగాని శ్రీనివాస్ కట్ చేశారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు** మేయర్ జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు ప్రాంతాల్లో అభిమానులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. బస్టాండ్ చౌరస్తాలో దేవరకొండ అజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మేయర్ పాల్గొని ప్రజలకు స్వయంగా అన్నప్రసాదం అందించారు.హౌసింగ్ బోర్డు కాలనీలోని వీరబ్రహ్మేంద్ర వృద్ధుల ఆశ్రమంలో కార్పొరేటర్లు ఏపీపీ చంద్ర, తోట అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలోనూ మేయర్ పాల్గొన్నారు.అలాగే నగరపాలక సంస్థ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో మేయర్ జన్మదిన వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.చింతకుంట శాంతినగర్‌లో నిర్వహించిన వేడుకల్లో మేయర్ కేక్ కట్ చేశారు. అనంతరం మహిళా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. స్థానికులు, బీజేపీ నాయకులు, యువకులు, కార్యకర్తలు, అభిమానులు మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. **ప్రజల ఆదరణ మరింత బాధ్యతను పెంచింది** ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, తన జన్మదినం సందర్భంగా నగరవ్యాప్తంగా నిర్వహించిన వేడుకలు, సేవా కార్యక్రమాలు ఎంతో ఆనందాన్ని కలిగించాయని అన్నారు. తనపై ప్రేమాభిమానాలు చూపుతూ ఆశీర్వదించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌తో పాటు నగర ప్రజలు, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు చూపుతున్న ఆదరణ తనపై మరింత బాధ్యతను పెంచిందని, నగర ప్రజల ఆశీస్సులతో కరీంనగర్ సమగ్ర అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.నగరంలో మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ప్రజలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం కృషి చేస్తానని మేయర్ తెలిపారు.



# భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు బోనాలతో తరలివచ్చిన మహిళలు గ్రామంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం





**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలం శ్రీనగర్ గ్రామంలో పోచమ్మ పండుగను గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులు, ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో పోచమ్మ తల్లి ఆలయానికి తరలివచ్చారు. బోనాలను సమర్పించి అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. కొందరు భక్తులు తమ మొక్కుల మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ప్రార్థించారు. పోచమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో ఎటు చూసినా భక్తి వాతావరణం కనిపించింది. మహిళలు, యువత, చిన్నారులు, వృద్ధులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతి ఏటా నిర్వహించే ఈ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని గ్రామ పెద్దలు తెలిపారు. పండుగలో భాగంగా గ్రామ ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఐకమత్యాన్ని చాటుకున్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణంలో పండుగ కార్యక్రమాలు జరిగేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోచమ్మ పండుగను విజయవంతం చేశారు. పోచమ్మ తల్లి కరుణాకటాక్షాలతో శ్రీనగర్ గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామస్తులు ప్రత్యేకంగా అమ్మవారిని వేడుకున్నారు.

# ముద్దునూరులో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- పారదర్శక సంక్షేమ పాలనకు ప్రభుత్వం మరో ముందడుగు



**వరంగల్ రూరల్ ప్రతినిధి,ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలకు నాణ్యమైన, పారదర్శక సంక్షేమ సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ముద్దునూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుల సునంద సదానందం అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు వేగంగా చేరేలా స్మార్ట్ రేషన్ కార్డుల వ్యవస్థ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ కార్డుల ద్వారా రేషన్ పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఆహార భద్రతను మరింత బలోపేతం చేయడంలో ఈ కార్డులు కీలకంగా నిలుస్తాయని, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోటపోతుల శైలజ కృష్ణ, జీపీఓ వాంకుడోత్ బికారి, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

# కరీంనగర్‌లో ఘనంగా మిలాద్-ఉన్-నబీ నీ ర్యాలీ









**కరీంనగర్ జిల్లా ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో మార్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో అజీమ్-ఓ-షాన్ మిలాద్-ఉన్-నబీ నీ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ముంబై స్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నాకా చౌరస్తా, మొహమ్మదీ మసీదు, సివిల్ హాస్పిటల్ రోడ్ మీదుగా సవారణ్ మసీదు వరకు కొనసాగింది. జోహార్ నమాజ్ అనంతరం సవారణ్ మసీదు నుంచి తిరిగి ప్రారంభమైన ర్యాలీ గీతా భవన్ చౌరస్తా, బస్ స్టాండ్ ఎదురుగా, అస్లాం మసీదు మీదుగా కరీముల్లా షా సాహెబ్ దర్గా వద్ద ముగిసింది. ర్యాలీలో వేలాది మంది ప్రజలు పాల్గొని శాంతి, సోదరభావం, ప్రేమ సందేశాన్ని చాటారు. ఈ సందర్భంగా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఏ. మోసిన్, సిటీ కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు అహ్మద్ అలీ, అర్షద్ అలీ, కమిటీ బాధ్యులు హాజీ ఖాన్, హబీబుద్దీన్, హాజీ అబ్దుల్ రెహ్మాన్, జమీల్ అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీకి కరీంనగర్ కలెక్టర్ చిత్ర మిశ్రా, పోలీస్ కమిషనర్ ఘౌస్ ఆలమ్, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు వి. అంజన్ కుమార్ తదితరులు స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ హజ్రత్ మహమ్మద్ నీ చూపిన శాంతి, ప్రేమ, సోదరభావం మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ప్రవక్త మహమ్మద్ నీ మానవాళికి శాంతి సందేశాన్ని అందించారని తెలిపారు.

# కష్టపడి చదివితేనే లక్ష్య సాధన!

- విజన్-40 జూనియర్ కళాశాల చైర్మన్ నవనీత రావు







**హనుమకొండ, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థినీ విద్యార్థులు అహర్నిశలు కష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని విజన్-40 జూనియర్ కళాశాల చైర్మన్ లింగంపల్లి నవనీత రావు అన్నారు. స్థానిక రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో వైభవంగా నిర్వహించిన విజన్-40 జూనియర్ కళాశాల "విక్టరీ ఫ్రెషర్స్ పార్టీ"కి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కళాశాల స్థాపించిన నాటి నుండి నేటి వరకు ఐఐటి, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో నిరంతరం ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నామని, విద్యార్థులు మరియు అధ్యాపకుల కఠోర శ్రమే ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీ పరీక్షలు, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ర్యాంకర్లను మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు అనుమాండ్ల నారాయణ రెడ్డి, డాక్టర్ పోడేటి కోటేశ్వరరావు, సంకెపల్లి శ్రీనివాస రెడ్డిలతో పాటు అధ్యాపకులు ఆసిస్, శక్తి, రాంకుమార్, రాజి రెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు. సభ అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరించాయి.

# సీఎం సార్.. మా గోడు ఆలకించండి

**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:**



గంగిరెడ్ల కులానికి చెందిన తమను ఎస్సీ లేదా ఎస్టీ జాబితాలో చేర్చి సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అండగా నిలవాలని ఆ కులస్థులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తమ కులానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో ఎన్నో ఏళ్లుగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగిరెడ్ల కులానికి చెందిన వారిలో కనుకుంట్ల ఇంటి పేరు ఉన్న కుటుంబాలు కూడా ఉన్నాయని వారు పేర్కొన్నారు. తమ సామాజిక పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, తమను సరైన రిజర్వేషన్ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం తమ కులాన్ని బీసీ-ఏ జాబితాలో చేర్చినప్పటికీ, ఆ రిజర్వేషన్ వల్ల తమకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం కలగడం లేదని సారయ్య, అనిల్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్య, ఉద్యోగాలు, ఆర్థిక అవకాశాల్లో తమ పిల్లలు వెనుకబడుతున్నారని, పేదరికం కారణంగా ఉన్నత విద్యను కొనసాగించలేకపోతున్నారని తెలిపారు. తరతరాలుగా ఎదుర్కొంటున్న వెనుకబాటుతనాన్ని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని అన్నారు. "సీఎం సార్.. మా పరిస్థితిని ఒకసారి పరిశీలించండి. మా కులం ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయించి, అర్హత ఉంటే ఎస్సీ లేదా ఎస్టీ జాబితాలో చేర్చి మమ్మల్ని ఆదుకోవాలి. మా పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించాలి" అని గంగిరెడ్ల కులస్థులు ప్రాధేయపడుతున్నారు. తమ డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తేవాలని వారు కోరారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని గంగిరెడ్ల కులస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. "రిజర్వేషన్ జాబితాలో సరైన గుర్తింపు.. మా భవిష్యత్‌కు భరోసా" అని వారు పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల చివరి బిల్లు విడుదల

- చివరి బిల్లులో 15 ,500 మంది లబ్ధిదారులకు ఊరట.
- ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది 185 కోట్ల రూపాయలు.



**తొర్రూరు ప్రతినిధి, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల మొదటి విడతగా చేపట్టిన గృహాలను కొందరు మాత్రమే పూర్తి చేసుకోగలిగారు. ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు గ్రామాల వారీగా గృహాలను నిర్మించుకొని సంవత్సర కాలంలోని పూర్తి చేయాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కూడా కొంతమంది లబ్ధిదారులు వారి గృహాలను పూర్తి చేసుకోలేక ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి ఆర్థిక సహాయం అందుబాటులో లేక అలాగే నిర్మించే తాపీ మేస్త్రీలతో ఇబ్బంది పడుతున్న గృహాలు లబ్ధిదారులు ఎందరో గృహాన్ని పూర్తి చేసుకోలేక సతమతమవుతున్నారు?. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడత లబ్ధిదారులకు చివరి బిల్లులను దశల వారీగా విడుదల చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది 2026 మార్చి వరకు ఇళ్లను పూర్తిచేసిన 15,500 మంది లబ్ధిదారులకు రూ.185 కోట్లను మంగళవారం ప్రభుత్వంవిడుదల చేసింది. లబ్ధిదారుల ఖాతాలో చివరి బిల్లు గురువారం జమకానుంది. కేంద్ర ప్రభుత్వ వాటా ఇంకా రాకపోవడంతో రాష్ట్ర నిధుల నుంచేచివరి బిల్లును ప్రభుత్వం అందిస్తోంది తెలిపారు.

# క్రమశిక్షణతో విద్యార్థులు ముందుకు సాకాలి: ఇంటెలిజెన్స్ ఎస్పీ రమేష్

- గురువు డోలీ రాజనర్సయ్యకు ఘన సన్మానం




**ఖమ్మం, ప్రతినిధి ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్ది, ఉన్నత వ్యక్తులుగా ఎదిగేలా మార్గదర్శకం చేసేలా కృషి చేసిన గురువులను ఎప్పటికీ మర్చిపోవద్దని ఇంటెలిజెన్స్ ఎస్పీ డి. రమేష్ అన్నారు. రిటైర్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ డోలీ రాజనర్సయ్య 87వ పుట్టినరోజు వేడుకలను ఖమ్మం ఖానాపురం హవేలీ మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిష్యుడు, ఇంటెలిజెన్స్ ఎస్పీ డి. రమేష్ ఈ వేడుకలను ఆత్మీయంగా నిర్వహించారు. తనతో పాటు అనేకమంది విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్ది, ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దారని అన్నారు. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిలో రాజనర్సయ్య అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని, 87 ఏళ్ల వయస్సులోనూ ఆయన ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మినీ ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శిష్యులు, అభిమానులు, సీనియర్ వాకర్ ఆలేటి శ్రీనివాసరావుతో పాటు పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

# మీ ఓటు హక్కు... మీ బాధ్యత!

**● నేటి గ్రామ సభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి ● 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి**




**తొర్రూరు ప్రతినిధి, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ లో భాగంగా 18 సంవత్సరాల నిండిన ప్రతి యువత పోరాకు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని ప్రకటించారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో నేడు గ్రామ సభలను ఏర్పాటు చేయనున్నామని గ్రామాల వారీగా గ్రామ సర్పంచులు తెలియపరిచారు. **గ్రామ సభల్లో నేడు జరగనున్న విశేషాలు?.** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్)లో భాగంగా రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో నేటి గ్రామసభ / వార్డు సభలు నిర్వహిస్తారు **సభలో ఏం జరుగుతుంది?** ముసాయిదా ఓటర్ల జాబితాలోని అన్ని ఓటర్ల పేర్లను చదివి వినిపిస్తారు. జాబితాలో పేరు లేని అర్హులైన పౌరుల వివరాలను పరిశీలిస్తారు. మొదటి 1వ తేదీ అక్టోబర్ నెల 2026 సంవత్సరం నాటికి 18 ఏళ్లు నిండే వారు ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే ఫారం-8 ద్వారా సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చు అర్హత లేని వ్యక్తుల పేర్లపై వారం-7 ద్వారా అభ్యంతరం తెలియజేయవచ్చు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, ధృవీకరణ ప్రక్రియపై అవగాహన కల్పిస్తారు **ఇది ఎక్కడ చేస్తారు ?.** గ్రామీణ ప్రాంతాల్లో: సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో మరియు పట్టణ ప్రాంతాల్లో: సంబంధిత పోలింగ్ కేంద్రంలో మీ పేరు ఓటర్ల జాబితాలో ఉందో తెలుసుకోండి తప్పులు ఉంటే సరిదిద్దుకోండి అర్హత ఉంటే ఓటరుగా నమోదు చేసుకోండి.

# నేడు గ్రామసభను విజయవంతం చేయండి: బాలిన రవి కుమార్

**● ఎస్ఐఆర్ ఫేజ్2లో భాగంగా గ్రామసభల నిర్వహణ**



**సీరోల్, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎస్ఐఆర్ ఫేజ్2లో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశానుసారం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభల ద్వారా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ఫేజ్- 2 కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని చిలుకోయలపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలిన రవి కుమార్ పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఓటరు జాబితా పరిశీలన, సవరణలు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామంలో అర్హులైన పౌరులందరూ గ్రామసభలకు హాజరై తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో పేర్లు లేని వారు, వివరాల్లో మార్పులు ఉన్న వారు గ్రామసభలో సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని బాలిన రవి కుమార్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బి ఎల్ ఏ లు సూపర్వైజర్లు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ఫేజ్2 గ్రామసభలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని, రామ పార్టీ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ, ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నారని అన్నారు

# నగరంలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 26 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బొంబాయి స్కూల్ నుంచి శాంతి ర్యాలీ ప్రారంభమై నగరంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. అనంతరం ర్యాలీ కరిముల్లాహ్ షా దర్గాహ్ వద్దకు చేరుకుని ముగిసింది. ర్యాలీలో ముస్లిం మత పెద్దలు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవక్త మహమ్మద్ నీ బోధించిన శాంతి, సోదరభావం, మానవ తా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీలో మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. నగరంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు శాంతియుత వాతావరణంలో నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# ఎస్ఐఆర్ ఫేజ్-2 రివ్యూ సమావేశాలకు కాంగ్రెస్ శ్రేణుల సమాయత్తం

**గ్రామసభలకు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలి : బుడిగం లక్ష్మీనారాయణ**



**సీరోల్, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు సీరోల్ మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్న ఎస్ఐఆర్ ఫేజ్-2 రివ్యూ సమావేశాలు ((గ్రామసభలు)ను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీన గురువారం ఉదయం 9 గంటలకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్ఐఆర్ ఫేజ్-2 రివ్యూ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో గ్రామాల అభివృద్ధి, ప్రజలకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, బీఎల్ఏలు, బీఎల్ఏ సూపర్వైజర్లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తప్పనిసరిగా గ్రామసభలకు హాజరై సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో సమావేశాలు సజావుగా జరిగేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ సర్ ఫేజ్-2 రివ్యూ సమావేశాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని బుడిగం లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు.

# ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల నగదు బహుమతి

**-మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ వెల్లడి**



**తొర్రూరు ప్రతినిధి, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎవరికైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు అందుబాటులో ఉన్న ప్రతి ఒక్కరు కూడా బాధితునికి సహాయం చేసే అవకాశాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించింది.. ఆదుకున్నందుకు వారికి తగిన పారితోషకాన్ని ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రహ్-వీర్ పథకం గురించి జిల్లా ప్రజలు తెలుసుకోవాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు .రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు మొదటి గంట (గోల్డెన్ అవర్ ) గా ఎంతో కీలకమని, ఈ సమయంలో గాయాలపాలైన వారిని వెంటనే ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని రహ్-వీర్‌గా గుర్తిస్తారని తెలిపారు. అర్హత పొందిన రహ్-వీర్‌కు రూ. 25,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేస్తారని పేర్కొన్నారు. **పౌరులు ఏం చేయాలి?.** రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు అక్కడ ఉన్నా, ప్రమాదాన్ని చూసినా పౌరులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించాలని శంకర్ నాయక్ సూచించారు. బాధితుడిని ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం తమ వివరాలను ఆస్పత్రిలో ఇవ్వాలని తెలిపారు. అక్కడి నుంచి సంబంధిత ఏరియా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి, సహాయం చేసిన వ్యక్తి వివరాలతో పాటు ఏ ఆస్పత్రిలో బాధితుడిని చేర్పించారనే సమాచారాన్ని తెలియజేస్తారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేసే జిల్లా స్థాయి కమిటీ ద్వారా వివరాలను పరిశీలించి, అర్హత ఉన్న రహ్-వీర్‌కు రూ. 25,000 నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు. **రహ్-వీర్ పథకం ముఖ్య ఉద్దేశం ఏమిటి?.** మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 134(ఎ) ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని రహ్-వీర్ గా పరిగణిస్తారని తెలిపారు. రహ్-వీర్ పథకం ముఖ్య ఉద్దేశం రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని తగ్గించడం, ప్రమాద సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు సామాన్య ప్రజలను ప్రోత్సహించడం అని శంకర్ నాయక్ వివరించారు. అలాగే బాధితులకు సహాయం చేసే పౌరులకు ఎలాంటి పోలీస్ లేదా చట్టపరమైన ఇబ్బందులు లేకుండా రక్షణ కల్పించడం కూడా ఈ పథకంలోని ముఖ్య ఉద్దేశాల్లో ఒకటని తెలిపారు. సంవత్సరానికి ఐదు సార్లు అవకాశం ఉంటుంది. సంవత్సరానికి ఒక వ్యక్తికి (5) సార్లు మాత్రమే రహ్-వీర్ నగదు బహుమతి, ప్రశంసా పత్రం ఇస్తారు అని శంకర్ నాయక్ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు. ఒక వ్యక్తి సమయానికి స్పందించి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడటమే కాకుండా, ఒక కుటుంబాన్ని విషాదం నుంచి రక్షించినవారవుతారని ఆయన అన్నారు. రహ్-వీర్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీటీఓ శంకర్ నాయక్ పేర్కొన్నారు.

# గుండెపోటుతో నిండిన శోకం..



**- తాజుద్దీన్ కుటుంబానికి ఆర్‌పీవీ జాతీయ అధ్యక్షుల ఓదార్పు**

**- గుండెపోటు మరణాలపై ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి: సయ్యద్ సాదిక్ అలీ**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అకాల మరణం ఒక కుటుంబాన్ని ఒక్కసారిగా శోకసముద్రంలోకి నెట్టివేస్తుందని, క్షణాల్లో ప్రాణాలను హరిస్తున్న గుండెపోటు మరణం వెనుక ఆ కుటుంబ సభ్యులు జీవితాంతం అనుభవించే వేదన దాగి ఉంటుందని రాజ్యాంగ పరిరక్షణ వేదిక (ఆర్‌పీవీ) వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్ అకాల మరణంతో విషాదంలో ఉన్న కుటుంబాన్ని బుధవారం ద్వారకానగర్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మైనారిటీ వర్గాల సంక్షేమానికి తాజుద్దీన్ చేసిన సేవలు చిరస్మరణీయం అని సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. తాజుద్దీన్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను కలసి వారి కష్టంలో భాగస్వాములయ్యారు. స్వచ్ఛమైన మనసు, నిరంతర ప్రజాసేవతో అందరి హృదయాల్లో స్థానం సంపాదించుకున్న తాజుద్దీన్ అకాల మరణం మైనారిటీ వర్గాలకే కాకుండా, ఆయనను అభిమానించే ప్రతి ఒక్కరికీ తీరని లోటని భావోద్వేగంగా మాట్లాడారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ తీరని లోటును పూడ్చడం ఎవరి వల్లా సాధ్యం కాదని, ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి మానవీయ బాధ్యత అని పేర్కొన్నారు. తాజుద్దీన్ కుమారుడు బీటెక్, కుమార్తె బీడీఎస్ చదువుతున్న విషయాన్ని తెలుసుకున్న సయ్యద్ సాదిక్ అలీ, వారి విద్యాభ్యాసం ఎక్కడా ఆగిపోకుండా భవిష్యత్తుపై ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. తండ్రిని కోల్పోయిన బాధను మాటల్లో ఓదార్చలేమని, అయినప్పటికీ కుటుంబ సభ్యులు మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండాలని కోరారు. తాజుద్దీన్ కుటుంబాన్ని ఈ విషాద సమయంలో ఒంటరిగా భావించవద్దని, పిల్లల భవిష్యత్తు కోసం కుటుంబానికి అవసరమైన సమయంలో తన వంతు సహకారం, అండదండలు అందిస్తామని భరోసా ఇచ్చారు. **గుండెపోటుపై ప్రజల్లో విస్తృత అవగాహన అవసరం** ఇటీవలి కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు ఘటనలు ఆందోళన కలిగించే స్థాయిలో చోటుచేసుకుంటున్నాయని సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. క్షణాల్లో ప్రాణాలను హరిస్తున్న గుండెపోటు కారణంగా అనేక కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు గుండె వైద్య నిపుణులతో అవగాహన శిబిరాలు నిర్వహించి, గుండె ఆరోగ్యంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో సకాలంలో స్పందించడం, గుండెపోటు లక్షణాలను గుర్తించడం, ప్రాథమిక చికిత్స (సిపిఆర్) పై ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇచ్చేలా హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తాజుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ తీరని విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని సయ్యద్ సాదిక్ అలీ ప్రార్థించారు. ఈ పరామర్శలో మహమ్మద్ సాబీర్ బాషా, మహమ్మద్ ఇస్మాయిల్, ముజీబ్, హనీఫ్, ఇబ్రహీం ఖాన్, ఆర్‌పీవీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి నజీరుద్దీన్, రూరల్ మండల బాధ్యులు పెంటు సాహెబ్, ఉపాధ్యాయులు అజీజ్, అల్లా బక్ష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా జవాబుదారీతనాన్ని పాటించాలి

**హియరింగ్ కేసుల పరిష్కారంపై వేగం పెంచాలి : ఎన్నికల పరిశీలకురాలు ప్రశాంతి**

**జిల్లాలో సమర్థవంతంగా SIR ప్రక్రియ జరుగుతుంది**

**క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి,: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**



**నంద్యాల, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR -2026) ప్రక్రియలో ప్రతి దశలోనూ పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్ మరియు ఇతర ఎన్నికల విధులను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎన్నికల పరిశీలకురాలు శ్రీమతి ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోనే వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, డి ఆర్ ఓ రాము నాయక్, వీఆర్వోలు, ఏ ఈ ఆర్ ల తో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పై ఎన్నికల పరిశీలకురాలు శ్రీమతి ప్రశాంతి సమీక్షించారు.న్నికల విధుల పరిశీలనలో భాగంగా బీఎల్ఓల పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, ఫారమ్‌ల పరిష్కారం, నోటీసుల విచారణ తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. అనంతరం ఎన్నికల పరిశీలకురాలు లిమాట్లాడుతూ.. క్షేత్రస్థాయి పరిశీలనలో బీఎల్ఓలు తమ విధులపై స్పష్టమైన అవగాహనతో, అవసరమైన ఆధారాలు మరియు పత్రాలను సక్రమంగా సేకరిస్తూ సమర్థవంతంగా పనిచేశారని తెలిపారు. లిరాజకీయ పార్టీలు లేవనెత్తుతున్న ప్రశ్నలు, సందేహాలను నివృత్తి చేయడంలో బీఎల్ఓలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.జిల్లా కలెక్టర్ రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్‌గా పనిచేసిన అనుభవాన్ని వినియోగిస్తూ సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. లిప్రణాళిక, శిక్షణ అంశాలను కలెక్టర్ మార్గదర్శకత్వంలో సమర్థవంతంగా నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో వాటిని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. మరణించిన వారి పేర్లను ఏఎస్‌డీ జాబితా నుంచి తొలగించే సమయంలో రాజకీయ పార్టీలతో స్పష్టమైన కమ్యూనికేషన్ కొనసాగించాలని తెలిపారు. లిడెత్ సర్టిఫికెట్, కుటుంబ సభ్యుల డిక్లరేషన్, అవసరమైన సందర్భాల్లో వీఆర్వో సమక్షంలో పంచనామా వంటి ఆధారాలను పరిశీలించిన అనంతరమే తొలగింపు ప్రక్రియ చేపట్టాన్నారు. లిగతంతో పోలిస్తే ఫారమ్-7 ద్వారా పేర్ల తొలగింపునకు వచ్చే అభ్యర్థనలు తగ్గడం బీఎల్‌ఓలు ఏఎస్‌డీ జాబితా ఆధారంగా మరణించిన ఓటర్లను ముందుగానే గుర్తించి, ఓటర్ల జాబితాను సమర్థవంతంగా ప్యూరిఫికేషన్ చేస్తున్నారనడానికి నిదర్శనమని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే వారపు సమావేశాలను కేవలం తహసీల్దార్ల స్థాయిలో కాకుండా ఈఆర్‌ఓలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. నో-మ్యాపింగ్, లాజికల్ ఎర్రర్స్‌కు సంబంధించిన కేసులను ప్రత్యేకంగా షెడ్యూల్ చేసి, నిర్ణీత 24 నుంచి 48 గంటల వ్యవధిలో కలెక్టర్ లాగిన్‌కు పంపాలని అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా జారీ చేసిన నోటీసులకు సంబంధించి హియరింగ్స్ ను త్వరితగతిన పూర్తి చేసి, పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్‌ను నిబంధనల ప్రకారం పరిశీలించి వేగంగా డిస్పోజల్ చేయాలని సూచించారు.లిఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోని పారదర్శకంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్యూరికేషన్, ఎన్నికల విధులను పగడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ప్రక్రియ భారత ఎన్నికల సంఘం సూచించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం వేగంగా కొనసాగుతోందనీ ఎన్నికల పరిశీలకురాలకు తెలిపారు. లిఅర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల జాబితాను పారదర్శకంగా, నిష్పాక్షికంగా శుద్ధి చేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయిందన్నారు SIR ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని 6,066 మంది, లాజికల్ డిస్క్రెపెన్సీస్ ఉన్న 74,217 మంది కలిపి మొత్తం 80,283 మంది ఓటర్లకు 100 శాతం నోటీసులు జారీ చేసి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 36,382 హియరింగ్స్ నిర్వహించి, సంబంధిత ఆధారాలను సేకరించామని అన్నారు. లిప్రస్తుతం ప్రతి కేసుకు సంబంధించి దీూా నివేదికతో పాటు ఎన్నికల సంఘం సూచించిన 13 రకాల ప్రామాణిక పత్రాలలో ఏదో ఒకదానిని సేకరించి విచారణలను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. లిపెండింగ్‌లో ఉన్న ఫారమ్-6 ఫారమ్-7లో ఫారమ్-8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా నిబంధనల ప్రకారం పరిష్కరిం చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



# భాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన బీజేపీ కార్యకర్తలు....!

**కరీంనగర్ ప్రతినిధి ఆగస్టు 26(పీసీడబ్ల్యూ న్యూస్):**
తిమ్మాపూర్ మండలం లోని వచ్చునూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త మద్దూరి చిరంజీవి గత నాలుగురోజుల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందారు.కాగా చిరంజీవి కుటుంబానికి సహాయమందించాలనే ఉద్దేశ్యంతో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్ మండల బీజేపీ గ్రూప్ ద్వారా సహాయంకోసం పెట్టిన మెసేజ్ ద్వారా మండలంలోని బీజేపీ కార్యకర్తలు కొంతమంది కలిసి ఉప్పులేటి జీవన్ ద్వారా సేకరించిన 16 వేల రూ. లను స్థానిక కార్యకర్తల సమక్షంలో ద్వారా మృతుని తండ్రి మొండయ్య కు బుధవారం అందించారు.తోటి కార్యకర్త మృతి చాలా భాదాకరంగా భావించి తమ వంతుగా అందించే సహాయం మృతుని కుటుంబానికి ఏదోరకంగా ఉపయోగపడ్తుందనే ఉద్దేశ్యంతో ఈ సహాయ కార్యక్రమం చేసినట్లు, ఈ కార్యక్రమానికి సహకరించిన వారికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ బూత్ అద్యక్షులు వీణవంక అంజయ్య,ఉప్పులేటి జీవన్, రాంహన్మాన్ నగర్ ఉప సర్పంచ్ అందే శేఖర్,బండి స్వామి ,పింగళి అమర్ వర్ధన్ రెడ్డి, ఉప్పులేటి బాబు,ఉప్పులేటి చిరంజీవి,మద్దూరి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల హక్కుల కోసం నేడు మహాధర్నా

**- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలి.. లేదంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం**

**- రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు**




**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):**
సంవత్సరాల తరబడి ప్రభుత్వ సేవలందించి, తమ జీవితంలోని విలువైన కాలాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం కోసం ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగులుగా ఉన్నప్పుడు ప్రభుత్వ బాధ్యతలను నిర్వర్తించిన వారే నేడు తమ హక్కుల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పెన్షనర్ల సమస్యలను ఆలస్యం చేయడం అంటే వారి వృద్ధాప్య జీవితాలను మరింత భారంగా మార్చడమేనని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏలు, ఉద్యోగుల ఆరోగ్య పథకం తదితర సమస్యలను పరిష్కరించడంతో పాటు పెన్షనర్లకు రావాల్సిన అన్ని న్యాయమైన ప్రయోజనాలను వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆవేదనను అర్థం చేసుకుని సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే జిల్లా కలెక్టరేట్ల ఎదుట ప్రారంభమయ్యే ఈ నిరసన రాష్ట్రవ్యాప్తంగా మరింత బలమైన ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు.ఆగస్టు 27న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాకు పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని టీఎస్ జిఆర్ఇఏ జిల్లా శాఖ పిలుపునిచ్చింది. తమ హక్కుల కోసం శాంతియుతంగా జరిగే ఈ మహాధర్నా ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా, సమస్యల పరిష్కారానికి ఒక గుణపాఠంగా నిలవాలని ఆకాంక్షించింది. పెన్షనర్ల సమస్యలు కేవలం ఆర్థిక అంశాలు కాదని, వారి జీవన భద్రతతో ముడిపడిన హక్కులని సంఘం నాయకులు పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ప్రశాంతంగా జీవించాల్సిన వృద్ధాప్యంలో కూడా తమ న్యాయమైన హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. **పెన్షనర్లు భవన్లో మహాధర్నా పోస్టర్ల ఆవిష్కరణ** ఆగస్టు 27న జరగనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను పెన్షనర్స్ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎం. సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు, జిల్లా నాయకులు ఎస్. పూర్ణచంద్రరావు, ఆర్. వెంకట్ నారాయణ, కొండలరావు, ఈ. వెంకటేశ్వర్లు, రమణ యాదవ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్‌లో కత్తుల కలకలం..!!

**ఇద్దరిపై కత్తులు,రాళ్లతో దాడి..!!**

**తొమ్మిది మందిపై కేసు..నలుగురు అరెస్ట్..!!**

**మరో నలుగురు జువైనల్స్ పోలీసుల అదుపులో..!!**

**ఇద్దరిపై హత్యాయత్నం..మొత్తం 8 మంది అదుపులో..!!**



**నంద్యాల, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ సమీపంలో ఇద్దరు వ్యక్తులపై కత్తులు,రాళ్లతో దాడి చేసిన ఘటనలో నిందితులపై చర్యలు చేపట్టినట్లు నంద్యాల 1వ పట్టణ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 24న రాత్రి 10.55 గంటల సమయంలో బైటిపేటకు చెందిన గుర్రం పశుపతి (32సం“),అతని తమ్ముడు మనోహర్‌పై తొమ్మిది మంది దాడికి పాల్పడ్డారు.కత్తులతో బెదిరించడంతో పాటు రాళ్లతో దాడి చేయడంతో ఇద్దరూ గాయపడినట్లు తెలిపారు.ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ 88/2026 గా కేసు నమోదు చేసి,దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. బి ఎన్ ఎస్ 191(1),191(2),118(1), 109(1) r/w 190 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.సంఘటనకు సంబంధించిన సాక్షుల వాంగ్మూలాలు,ఇతర ఆధారాలను సేకరించి నిందితులను గుర్తించినట్లు చెప్పారు.దర్యాప్తులో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో బైటిపేటలోని బ్రహ్మంగారి గుడి సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.నలుగురు నిందితులను అరెస్టు చేయగా,మరో నలుగురు జువైనల్స్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.నిందితులను విచారించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా దాడులకు పాల్పడితే,కఠిన చర్యలు తప్పవని సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు.కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు.

# 31 వ సారి రక్తదానం చేసిన ముద్దం నాగ నవీన్‌కు అభినందనలు





**మిలాదున్ నబీ సందర్భంగా గర్భిణీ మహిళలకై దర్గా కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

**నంద్యాల, ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):**పవిత్ర జష్న్-ఎ-మిలాదున్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో గల శ్రీ హజరత్ సయ్యద్ గులాబ్ షావలి అల్-రఫాయి అహ్మది దర్గా వద్ద “గర్భిణీ మహిళల ప్రాణ రక్షణ కోసం ప్రత్యేక రక్తదాన శిబిరం“ విజయవంతంగా జరిగింది. దర్గా కమిటీ మరియు విజయ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో స్థానిక యువకుడు ముద్దం నాగ నవీన్ పాల్గొని తన 31 వ సారి (A+ పాజిటివ్) రక్తదానం చేసి గొప్ప మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ముద్దం నాగ నవీన్ ను టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ మరియు నంద్యాల పట్టణ ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విజయ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు మరియు ఎస్సై సురేష్ గారు ముద్దం నాగ నవీన్ కు ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులతో పాటు విజయ బ్లడ్ సెంటర్ నిర్వహణ కార్యదర్శి సద్దాం హుసేన్, దర్గా కమిటీ సభ్యులు సయ్యద్ మక్బూల్ బాషా, సయ్యద్ సయ్యద్ షా, సయ్యద్ గులాబ్, సయ్యద్ మౌలి, సయ్యద్ ఉస్మాన్, సయ్యద్ జుబేర్, సయ్యద్ ఖాదర్ బాషా, సయ్యద్ వసీం మరియు ఇతర విజయ బ్లడ్ సెంటర్ సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో మౌలానా ముస్తాక్ అహ్మద్ భేటీ

**• మైనారిటీల సంక్షేమం, యువతకు ఉపాధిపై కీలక చర్చ**



**అమరావతి ఆగస్టు 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఏపీ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, తెదేపా మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అలాగే మైనారిటీ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పన తదితర కీలక అంశాలపై ముఖ్యమంత్రితో ఆయన చర్చించారు. రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు అందిస్తున్న విశేష సహకారం, మార్గదర్శకత్వానికి ముస్తాక్ అహ్మద్ ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.





# గర్భంతోనూ జిమ్‌లో సమంత.

గర్భధారణ సమయంలో తన ఫిట్‌నెస్ రొటీన్ ఎలా మారిందో నటి సమంత వెల్లడించింది. జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఇన్నాళ్లూ శరీరాన్ని మరింతగా శ్రమ పెట్టేలా శిక్షణ తీసుకున్నానని.. ఇప్పుడు శరీరం చెప్పేది వినడం నేర్చుకుంటున్నానని తెలిపింది.
సమంత ఎన్నో ఏళ్లుగా శక్తిని పెంచే వ్యాయామాలు చేస్తున్నట్లు చెప్పింది. గర్భధారణ సమయంలోనూ వ్యాయామం కొనసాగించేందుకు వైద్యుడి అనుమతి తీసుకున్నానని తెలిపింది. తన ట్రైనర్‌కు గర్భధారణ సమయంలో వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ ఉందని వెల్లడించింది. తన శరీరం, గత అనుభవం, గర్భధారణ పరిస్థితికి తగ్గట్టుగా వర్కౌట్స్‌లో మార్పులు చేసినట్లు వివరించింది.
ప్రతి ఒక్కరి గర్భధారణ ఒకేలా ఉండదని సమంత చెప్పింది. తన వర్కౌట్స్‌ను ఇతరులు అనుసరించొద్దని సూచించింది. వ్యాయామం చేసే ముందు వైద్యుడిని సంప్రదించాలని.. నిపుణులైన ట్రైనర్ సాయం తీసుకోవాలని కోరింది..తాను పంచుకున్న వీడియోలో ఛాతీకి సంబంధించిన వ్యాయామం చేసింది. అయితే గతంలోలా ఎక్కువ బరువు ఎత్తడంపై కాకుండా.. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడంపైనే ఇప్పుడు దృష్టి పెట్టినట్లు చెప్పింది. కొన్ని రోజులు వ్యాయామాన్ని తగ్గిస్తున్నానని తెలిపింది.
కొన్ని రోజులైతే వర్కౌట్ మొత్తం నేలపై పడుకోవడంతోనే పూర్తవుతోందని సమంత సరదాగా వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా తన శరీరాన్ని మరింత పని చేయడానికి సిద్ధం చేశానని.. ఇప్పుడు తక్కువ పని చేయమని శరీరం అడిగినప్పుడు దాన్ని గౌరవించడం నేర్చుకుంటున్నానని పేర్కొంది.
చిన్న ప్రాణాన్ని మోస్తున్న సమయంలో లక్ష్యాలు కూడా మారిపోతాయని సమంత అభిప్రాయపడింది. తన శరీరం ఇప్పటివరకు చేసిన పనుల్లో ఇదే అత్యంత బలమైన పని కావచ్చని పేర్కొంది. సమంత 2026 జూన్‌లో తన గర్భధారణ విషయాన్ని బహిరంగంగా వెల్లడించింది. భర్త రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలకబోతున్నట్లు ప్రకటించింది.

# ‘టాక్సిక్’ దూకుడు..

## మధ్యాహ్నానికే ‘ధురంధర్‘ను దాటేసిన యశ్ మూవీ

యశ్ నటించిన ‘టాక్సిక్’కు ఆరంభంలో ఎదురైన విమర్శలు, ఆన్‌లైన్ ట్రోలింగ్ నేడు బాక్సాఫీసు ప్రభంజనానికి ఏమాత్రం అడ్డుకాలేదు. బుధవారం ఉదయం నుంచే సినిమా థియేటర్ల వద్ద సందడి కనిపించింది. మధ్యాహ్నానికి ముందే రణ్‌వీర్ సింగ్ ‘ధురంధర్’ తొలిరోజు భారత్‌లో నెట్ వసూళ్లను ‘టాక్సిక్’ దాటేసింది.
ఓనం సెలవును టార్గెట్ చేస్తూ ‘టాక్సిక్’ ప్రేక్షకుల ముందుకొచ్చింది. సినిమా హింస, రొమాంటిక్ సన్నివేశాలపై విడుదలకు ముందు చర్చ జరిగినా ప్రేక్షకుల స్పందన మాత్రం బలంగా కనిపించింది. ఉదయం షోలకే పలు ప్రాంతాల్లో థియేటర్లు కళకళలాడాయి.
‘సాక్‌నిల్క్’ లెక్కల ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.40 గంటలకు ‘టాక్సిక్’ ఇండియా నెట్ వసూళ్లు రూ.31.76 కోట్లకు చేరాయి. 9,003 షోల ద్వారా ఈ మొత్తం వచ్చింది. ఇండియా గ్రాస్ రూ.37.48 కోట్లుగా నమోదైంది.
కన్నడ 2డీ వెర్షన్ 77.69 శాతం ఆక్యుపెన్సీతో ముందుంది. తెలుగు వెర్షన్ 57.08 శాతం, తమిళం 45.25 శాతం, మలయాళం 40.13 శాతం, హిందీ




37.85 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేశాయి.
రణ్‌వీర్ సింగ్ నటించిన ‘ధురంధర్’ తొలిరోజు ఇండియాలో రూ.28.60 కోట్ల నెట్, రూ.33.60 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ‘టాక్సిక్’ ఉదయం షోలతోనే ఆ మార్కును అధిగమించింది.
యశ్ ‘కేజీఎఫ్: చాప్టర్ 2’ తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.100–120 కోట్ల వసూళ్లు సాధించొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఆ స్థాయికి చేరితే అతిపెద్ద ఇండియన్ ఓపెనర్లలో ఒకటిగా నిలుస్తుంది. రూ.100 కోట్ల మార్కును దాటితే ‘కేజీఎఫ్: చాప్టర్ 2’ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో కన్నడ చిత్రంగా నిలుస్తుంది.



# యంగ్ హీరోల కొత్త ట్రెండ్‌లోకి కార్తికేయ!

టాలీవుడ్‌లో హీరోలు కేవలం యాక్టింగ్‌కే రిమితం కాకుండా కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంటి విభాగాల్లోనూ తమదైన ముద్ర వేయాలని చూస్తున్న ట్రెండ్ క్రమంగా బలపడుతోంది. ఒకప్పుడు హీరోగా కెరీర్‌లో సెటిలైన తర్వాతే డైరెక్షన్ వైపు అడుగులు పడేవి. కానీ ఇప్పుడు యంగ్ హీరోలు తమకు నచ్చిన కథలను తామే చెప్పాలనే ఆలోచనతో కెమెరా వెనక్కి వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ మారుతున్న ట్రెండ్‌లో ఇప్పుడు కార్తికేయ కూడా చేరబోతున్నారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కార్తికేయ, ఇకపై కేవలం హీరోగా మాత్రమే కాకుండా సినిమా మేకింగ్‌లోని ఇతర విభాగాలపైనా దృష్టి పెట్టబోతున్నారనే డిస్కషన్ మొదలైంది. ముఖ్యంగా కథను సెలెక్ట్ చేసుకోవడం నుంచి దాన్ని తెరపైకి తీసుకురావడం వరకు మొత్తం క్రియేటివ్ రెస్పాన్సిబులిటీ తీసుకోవాలనే ఆలోచన యంగ్ హీరోల్లో పెరుగుతున్న నేపథ్యంలో కార్తికేయ డెసిషన్ కూడా అదే దిశలో కనిపిస్తోంది. ఇప్పటికే టాలీవుడ్‌లో నటుల నుంచి డైరెక్టర్లుగా మారిన ఉదాహరణలు చాలానే ఉన్నాయి. ఎన్టీఆర్, కృష్ణ, విజయ నిర్మల వంటి దిగ్గజాల నుంచి అవసరాల శ్రీనివాస్, విశ్వక్‌సేన్ వంటి సమకాలీన నటుల వరకు పలువురు యాక్టింగ్‌తో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. అయితే ప్రస్తుత తరం హీరోలలో ఈ ఆలోచనకు మరో కొత్త కోణం కనిపిస్తోంది. తమ మార్కెట్‌కు తగ్గ కథ కోసం ఎదురు చూడటం కంటే, తమకు నమ్మకం ఉన్న కథను తామే డెవలప్ చేసి ఆడియన్స్ ముందుకు తీసుకురావాలనే ప్రయత్నం పెరుగుతోంది. దీనికి మరిన్ని ఎగ్జాంపుల్స్ కూడా కనిపిస్తున్నాయి. ఆల్రెడీ కిరణ్ అబ్బవరం డైరెక్టర్ గా మారి సినిమా చేస్తుండగా, ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కూడా ఇదే బాటలో వెళ్తూ, తన స్వీయ దర్శకత్వంలో నటిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాల నటనా ప్రయాణం తర్వాత రామ్ డైరెక్షన్ లోకి అడుగుపెడుతున్నారు. యాక్టర్ గా సంపాదించిన ఎక్స్‌పీరియెన్స్‌ను ఇప్పుడు డైరెక్టర్ గా ఉపయోగించుకోవాలనే ప్రయత్నం ఈ మారుతున్న ఆలోచనా విధానానికి అద్దం పడుతోంది.

# కృతి సనన్ డ్రెస్‌పై దుమారం..

## రాఖీ యాడ్ ను వెనక్కి తీసుకున్న జ్యువెల్లరీ బ్రాండ్



ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ ‘జీవ‘ తన రక్షాబంధన్ వాణిజ్య ప్రకటనను అన్ని మీడియా వేదికల నుంచి ఉపసంహరించుకుంది. బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన ఈ యాడ్‌లో ఆమె ధరించిన దుస్తులు, ప్రచార కాన్సెప్ట్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వివాదంపై ‘జీవ‘ బుధవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది.
భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల పట్ల తమకు అపారమైన గౌరవం ఉందని సంస్థ పేర్కొంది. కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవడంతో పాటు, పెంపుడు జంతువులతోనూ ఆ అనుబంధాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ప్రచారాన్ని రూపొందించినట్లు వివరించింది. అయితే, ఇది అనుకోకుండా కొందరి మనోభావాలను దెబ్బతీసిందని అంగీకరించింది. అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ సదరు ప్రకటనను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించింది.సుమారు 36 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోలో కృతి సనన్, బ్రాలెట్ తరహా బ్లౌజ్‌తో కూడిన ఇండో-వెస్ట్రన్ దుస్తుల్లో కనిపించారు. తన సోదరుడికి, ఒక పెంపుడు శునకానికి ఆమె రాఖీ కడుతున్నట్లు అందులో చూపించారు. ఆమె వస్త్రధారణతో పాటు, రక్షాబంధన్ సంప్రదాయంలో పెంపుడు జంతువును భాగం చేయడంపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.ఈ ప్రకటనపై నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఘాటుగా విమర్శలు గుప్పించారు. ‘లోదుస్తులు ధరించి సోదరుడికి రాఖీ కడతారా?‘ అని ప్రశ్నిస్తూ, ఇది ఉద్దేశపూర్వకంగా అసభ్యంగా ఉందని వ్యాఖ్యానించారు. నెటిజన్ల నుంచి కూడా పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో, సదరు జ్యువెల్లరీ బ్రాండ్ ఈ ప్రకటనను వెనక్కి తీసుకుంది.

# గోల్డెన్ గ్లోబ్ అవార్డును పగలగొట్టి అబద్ధం చెప్పా: ఇయాన్ మెక్‌కెల్లెన్



దిగ్గజ నటుడు సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్ తన కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ అవార్డుకు సంబంధించి తాను చెప్పిన ఒక అబద్ధాన్ని తాజాగా వెల్లడించారు. ప్రమాదవశాత్తు ఆ పురస్కారం మెమొంటో విరిగిపోవడంతో, అది కనిపించడం లేదని నిర్వాహకులకు అబద్ధం చెప్పినట్లు ఆయన అంగీకరించారు. 1997లో “రస్పుటిన్: డార్క్ సర్వెంట్ ఆఫ్ డెస్టినీ“ చిత్రంలో అద్భుత నటనకు గానూ మెక్‌కెల్లెన్ ఉత్తమ సహాయ నటుడిగా గోల్డెన్ గ్లోబ్ అవార్డును దక్కించుకున్నారు. త్వరలో ప్రసారం కానున్న ‘టీ విత్ జూడీ డెంజ్ ఫీచరింగ్ సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్‘ అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. దీనికి సంబంధించిన ఒక వీడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.“ఆ గోల్డెన్ గ్లోబ్ ప్రతిమను ఎలా తయారు చేశారో తెలుసుకోవాలనే కుతూహలంతో దాని కింద ఉన్న ఒక స్క్రూను విప్పాను. వెంటనే ఆ పురస్కారం ముక్కలైపోయింది. దాన్ని నేను తిరిగి అమర్చలేకపోయాను. అదే సమయంలో నా పేరును ఆ ప్రతిమపై చెక్కడం కోసం దానిని తిరిగి పంపాలని నిర్వాహకులు కోరారు. దాంతో అది కనిపించడం లేదని వారికి అబద్ధం చెప్పాల్సి వచ్చింది“ అని మెక్‌కెల్లన్ వివరించారు.మెక్‌కెల్లెన్ తన సుదీర్ఘ కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ పురస్కారం ఇదే కావడం విశేషం. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మరో ప్రముఖ నటి డేమ్ జూడీ డెంజ్ కూడా తన ఆస్కార్ అవార్డుకు సంబంధించిన ఒక పొరపాటును పంచుకున్నారు. స్కై ఆర్ట్స్ ఛానల్‌లో ఈ కార్యక్రమం త్వరలో ప్రసారం కానుంది.



# నా అంత సాధించాక మాట్లాడండి..

## శత్రువులకు క్వీన్ మాస్ వార్నింగ్!

నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తనపై విమర్శలు గుప్పిస్తున్న పలువురు బాలీవుడ్ ప్రముఖులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం స్టిల్ ఫోటోగ్రాఫర్లతో మాట్లాడిన కంగన .. కెరీర్‌లో ఎలాంటి విజయం సాధించని వారు తనకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. గత కొన్ని నెలలుగా తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తోటి నటీనటులు, ప్రముఖులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆశుతోష్ రాణా, సోనూ సూద్, రాఖీ సావంత్, తాప్సీ పన్నులను పేరుపేరునా ప్రస్తావిస్తూ కంగనా అసహనం వ్యక్తం చేశారు. నన్ను కుక్కలా మొరుగుతానని ఆశుతోష్ రాణా అంటారు. ఎలా నడుచుకోవాలో నేర్చుకోవాలని సోనూ సూద్ సలహాలు ఇస్తారు. రాఖీ సావంత్ నా వ్యక్తిత్వాన్ని ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేస్తుంది. ఇక తాప్సీ పన్ను అయితే నా తల్లిదండ్రులు.. నా పెంపకం.. నా నేపథ్యాన్ని వరుసగా అవమానిస్తూనే ఉంది! అని కంగనా మండిపడ్డారు తమ కెరీర్‌లో తాను సాధించిన విజయంలో కనీసం 1 శాతం కూడా సాధించలేని వారి ఉచిత సలహాలు వినేందుకు తాను సిద్ధంగా లేనని కంగనా స్పష్టం చేశారు. నా లైఫ్‌లో నేను సాధించిన విజయంలో ఒక శాతం కూడా సాధించని వారి జ్ఞానాన్ని నేను వినను. పరిశ్రమలో విఫలమై.. ఆదరణ లేని కొందరు వ్యక్తులు ఎప్పుడూ నన్ను తిడుతూనే ఉంటారు. వారు మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఇదంతా చేస్తున్నారు. ముందు నా స్థాయికి ఎదగండి.. ఆ తర్వాత మాట్లాడండి. నాకంటే ఎక్కువ విజయం సాధించిన వారు చెబితేనే నేను వింటాను.. ఇక సహించేది లేదు! అని వ్యాఖ్యానించారు.జెన్ జెడ్ .జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనలపై కంగనా చేసిన కామెంట్లు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో కొంతమంది యువకులను, మహిళలను –జనరేషన్ గట్టర్– అని కంగనా సంబోధించడాన్ని సోనూ సూద్ తప్పుపట్టారు. అదేవిధంగా తాప్సీతోనూ కంగనకు పాత విభేదాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలో 2014లోనే భారత్‌కు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని కంగనా అన్న మాటలపై రాఖీ సావంత్ పంచ్ లు విసిరారు.